క్లుప్తంగా

పార్కు ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థలాలను పరిశీలిస్తున్న తుడా అధికారులు

నింద్ర: మండల కేంద్రం నింద్రలో పార్కు ఏర్పాటుకు మంత్రి రోజా కృషి చేస్తున్నట్లు ఎంపీపీ దీప అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఉన్న రెడ్డిగుంటను తిరుపతి తుడా అధికారులు పరిశీలించారు. మంత్రి రోజా చొరవతో పార్కు ఏర్పాటుకు అవసరమైన స్థలాలను పరిశీలిస్తున్నట్లు వారు తెలిపారు. త్వరలోనే పార్కు ఏర్పాటు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బాబురెడ్డి, వైస్ ఎంపీపీ శుభ, నాయకులు శివయ్య, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానం ప్రారంభం



నిత్యాన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రతాప్‌స్వామీజీ

పుత్తూరు: అప్పలాయగుంటలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి దర్శనార్థం వచ్చే భక్తులకు నిత్యాన్నదాన కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. ఏకవీర సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఇకపై ప్రతిరోజూ కొనసాగుతుందని ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రతాప్‌స్వామీజీ తెలిపారు. వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని 3 వేల మందికి అన్నదాన వితరణ చేసినట్లు చెప్పారు. ప్రతిరోజూ స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులు 300 మందికి అన్నదానం చేయడం జరుగుతుందని వివరించారు.

ప్రజా సమస్యలకే తొలి ప్రాధాన్యం



మాట్లాడుతున్న ఎంపీపీ సరిత

శ్రీరంగరాజపురం: ప్రజా సమస్యలకే తొలి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎంపీపీ సరిత అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని, లబ్ధిదారులను గుర్తించడంలో అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణంతో పాటు మరుగుదొడ్ల నిర్మాణానికి అదనంగా రూ.18 వేలు అందిస్తున్నట్లు చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఎన్నికలకు ముందు రూపాయి వేసి ఇల్లు మంజూరు చేసి టీడీపీ ప్రజలను నిలువునా మోసం చేసిందన్నారు. కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం అలాంటి వారికి కూడా మళ్లీ ఇల్లు మంజూరు చేసి, డబ్బు చెల్లించడం జరుగుతోందన్నారు. రైతులు సాగు చేసిన పంటలను ఈ క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని సూచించారు. మండలంలో ఉన్న రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 24 గంటలు అందుబాటులో ఉంటాయన్నారు. 2003 సంవత్సరం కంటే ముందు డీకేటీ భూములను అమ్ముకునేందుకు ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణయ్య, తహసీల్దార్ బెన్నురాజు, ఈఓపీఆర్‌డీ పురుషోత్తం, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మోక్ష మార్గం.. వైకుంఠద్వారం

- ఆలయాలకు వైకుంఠ ఏకాదశి శోభ
- పుష్పాలంకరణ, విద్యుత్ వెలుగుల్లో కాంతులీనుతున్న కోవెలలు
- పోటెత్తిన భక్తకోటి
- వైకుంఠద్వార దర్శనంతో తన్మయత్వం పొందిన భక్తులు






వైకుంఠద్వార దర్శనం చేసుకుంటున్న భక్తులు, శ్రీరంగరాజపురం: స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు, ఆలయంలో బారులు తీరిన భక్తులు, ప్రత్యేక అలంకరణలో ప్రసన్న ఆంజనేయ స్వామి




కార్వేటినగరం: స్వామివారిని దర్శించుకునేందుకు క్యూకట్టిన భక్తులు, నింద్ర: అమ్మవారి ఆలయంలో..

నగరి: మున్సిపల్, మండల ప్రాంతాల్లోని ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. పట్టణ పరిధిలో టీటీడీ ఆధీనంలోని కరియమాణిక్యస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం ఐదు గంటల నుంచే భక్తులు క్యూలైన్లో బారులు తీరారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేయడంతో ఆలయంలోని క్యూలైన్లు నిండడంతో పాటు ఆలయం వెలుపల వీధిలో క్యూలో నిలబడాల్సి వచ్చింది. ఏకాదశిని పురస్కరించుకుని వైకుంఠద్వారంలో వెళ్లి ప్రత్యేక అలంకరణలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత కరిమాణిక్యసామిని భక్తులు దర్శించుకున్నారు. ఏఈఓ పార్థసారథి, డిప్యూటీ ఈఓ నాగరత్నమ్మ, సూపరింటెండెంట్ రమేష్, ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఆలయం వెలుపల ఆలయ సేవకులు ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. రాజీవ్ నగర్ కొండపై ఉన్న షిర్డీ సాయి దివ్యధామంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు నిర్వహించగా భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనం కల్పించారు. తెరణి గ్రామంలో అతి ప్రాచీన దేవాలయమైన వైకుంఠనాథస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని గరుడవాహన సేవ నిర్వహించారు. బుగ్గ కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలోని ప్రయాగ మాధవస్వామిని భక్తులు భారీ సంఖ్యలో దర్శించుకున్నారు.

అబ్బురపరచిన అలంకరణలు

పట్టణ పరిధిలోని ప్రసన్న వీరాంజనేయ స్వామి ఆలయంలో ఏకాదశిని పురస్కరించుకుని చేసిన పుష్పాలంకరణ అలంకరణ భక్తులను అబ్బురపరిచాయి. మూలవిరాట్ ఆంజనేయ స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. వైకుంఠద్వారం ఏర్పాటు చేసి అందులో ఉంచిన గరుడవాహన వేంకటేశ్వర స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో..

కార్వేటినగరం: కార్వేటినగరంలో వెలసిన శ్రీవేణుగోపాలస్వామి ఆలయం శనివారం వైకుంఠ ఏకాదశి శోభతో కాంతులీనింది. ఈ సందర్భంగా వేకువజామున స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి మూల విరాట్‌కి పసుపు, చందనం, పాలు, పెరుగు, తేనే నారికేళి జలాలు వంటి సుగంధభరిత ద్రవ్యాలతో అభిషేకించారు. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఉదయం 4 గంటల నుంచి భక్తులు క్యూకట్టారు. ఏఈఓ పార్థసారథి, టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్, అర్చకులు దాశరథి, గోపాలాచారి, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురంలో

శ్రీరంగరాజపురం: మండలంలోని సింధూరాజపురంలో వెలసిన శ్రీ అభయ ఆంజనేయస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం శ్రీ అభయ ఆంజనేయస్వామికి పాలాభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో బెంగళూరు నుంచి ప్రత్యేకంగా తెచ్చిన పూలతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త బాలాజీనాయుడు, వైస్ చైర్మన్ గొల్లపల్లి సుబ్రమణ్యం నాయుడు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నింద్రలో..

నింద్ర: మండలంలోని కనుమరాజు పాళెంలో శనివారం వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని మహాలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం హోమం, పూర్ణాహుతి, గణపతి పూజ చేపట్టారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తులు పెద్దఎత్తున అమ్మవారిని దర్శించుకున్నారు.

జోనల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులతో హెచ్‌ఎం

నగరి: మండలంలోని నాగరాజకుప్పం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించిన జోనల్స్ పోటీల్లో నగరి వశిష్ట విద్యాలయానికి చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. బాలుర బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థి కేసీ తేజేష్ జోనల్‌స్థాయిలో ప్రథమ బహుమతిని గెలుచుకోగా షాట్‌పుట్ సీనియర్ బాయ్స్ విభాగంలో ప్రథమ, ద్వితీయ బహుమతులను కార్తికేయన్, రూబన్‌రాజ్ అందుకున్నారు. జావెలిన్‌త్రో విభాగంలో ప్రథమ, ద్వితీయ బహుమతులను కార్తికేయన్, ఆకాష్, డిస్కస్‌త్రోలో ప్రథమ బహుమతిని రూబన్‌రాజ్, జూనియర్ బాయ్స్‌లో ఖోఖోలో రన్నర్స్, జూనియర్ బాయ్స్ రిలే 400 మీటర్లు, 100 మీటర్ల పోటీల్లో తృతీయ బహుమతిని వశిష్ట విద్యార్థులు కైవసం చేసుకున్నారు. ప్రతిభ చూపి పథకాలు గెలుచుకున్న విద్యార్థులను, పీఈటీ విజయ్‌ని హెచ్‌ఎం రాజరాజేశ్వరి, రిటైర్డ్ ఎంఈఓ జయచంద్రుడు అభినందించి సన్మానించారు.

విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాట



ట్యాబ్‌లు అందుకున్న విద్యార్థులతో ఎంపీపీ అనిత, సర్పంచ్ వీసీ సుబ్రమణ్యం, అధికారులు

గంగాధర నెల్లూరు: రాష్ట్రప్రభుత్వం విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తోందని ఎంపీపీ అనిత, సర్పంచ్ వీసీ సుబ్రమణ్యం అన్నారు. శనివారం మండలకేంద్రంలోని జీడీ నెల్లూరు ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వారు ట్యాబులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 8వతరగతి విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయాలన్న ఉద్దేశంతో బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబులు పంపిణీ చేస్తోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ ట్యాబులను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని, భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలన్నారు. మండలంలో దాదాపు 484 మందికి విద్యార్థులకు ట్యాబ్‌ల కోసం రూ.1.60 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసిందని తెలిపారు. అనంతరం జీడీ నెల్లూరు పాఠశాలలోని 51 మంది 8వతరగతి విద్యార్థులకు ట్యాబులు అందజేశారు. అనంతరం రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై అవగాహనపై పాఠశాల విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీని ఎంపీపీ అనిత పచ్చజెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆడుదాం ఆంధ్ర ప్రత్యేకాధికారి ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విద్యాసాగర్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సుధాకర్, ఎంఈఓ గుణశేఖర్ రెడ్డి, సర్పంచ్ వీసీ సుబ్రమణ్యం, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం దినకరన్, విద్యాకమిటీ చైర్మన్ పాల్గొన్నారు.

అయోధ్య రాముడి అక్షింతలు ఊరేగింపు



పురవీధుల్లో అక్షింతలను ఊరేగిస్తున్న భక్తులు

నగరి/పుత్తూరు: అయోధ్య రామజన్మ భూమి నుంచి అందించబడిన శ్రీరామచంద్రున్ని అభిషేకించిన అక్షింతల ఊరేగింపు కార్యక్రమం నగరి, పుత్తూరులో వైభవంగా జరిగింది. శనివారం సాయంత్రం సమరత సేవా ఫౌండేషన్, హిందూ ధార్మిక సమ్మేళనం ఆధ్వర్యంలో మంగళ వాయిద్యాలు, భజనలతో పురవీధుల్లో అత్యంత భక్తి ప్రపత్తులతో అక్షింతల ఊరేగింపు నిర్వహించారు. అనంతరం స్థానిక కస్తూరి కల్యాణ మండపంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ తిరుపతి విభాగ కోఆర్డినేటర్ కుమారస్వామి రెడ్డి మాట్లాడుతూ అయోధ్యలో జనవరి 22వ తేదీన కనీవినీ ఎరుగని రీతిలో రామమందిర ప్రారంభోత్సవం జరగనుందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు దయానిధి, చంద్రారెడ్డి, మునికృష్ణారెడ్డి, వేణుబాబు విచ్చేసిన భక్తులకు అన్నదానం చేశారు. ఎస్ఎస్ఎఫ్ నగరి సబ్‌డివిజన్ కన్వీనర్ వీఎస్ నమశ్శివాయం, మండల కన్వీనర్ మురుగప్ప కోనేరి తదితరులు పాల్గొన్నారు.

చెరుకు తోట దగ్ధం

పుత్తూరు: వడమాలపేట మండలం ఓబీఆర్ కండ్రిగ పంచాయతీ పాపరాజు కండ్రిగలో శుక్రవారం రాత్రి ప్రమాదవశాత్తు చెరకు తోట దగ్ధమైంది. జి.వెంకటేశ్వరరావుకు చెందిన చెరకు తోటలో విద్యుత్ తీగలు తగలడంతో షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి పంట పూర్తిగా అగ్నికి ఆహుతైంది. చేతికంది వచ్చే దశలో పంట కాలిపోయిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.

పైలేరియా వ్యాధి నియంత్రణకు జాగ్రత్తలు



రక్త పరీక్షలు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

పాలసముద్రం: గ్రామీణ ప్రాంతాల్లో పైలేరియా వ్యాధి సోకకుండా ప్రభుత్వ ఆదేశాల మేరకు ముందస్తు చర్యలు చేపట్టాలని వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్ తెలిపారు. శనివారం రాత్రి పైలేరియాపై బలిజకండ్రిగ, పాలసముద్రంలో గ్రామాల్లో వైద్యాధికారి మోహన్‌కృష్ణ ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది ఎనిమిది టీములుగా ఏర్పడి ప్రతి ఇంటి వద్దకు వెళ్లి రక్త పరీక్షలు చేశారు. డాక్టర్ మోహన్‌కృష్ణ మాట్లాడుతూ మైక్రో పైలేరియా అనే దోమకాటు వల్ల ఈ పైలేరియా వ్యాధి సోకుతుందన్నారు. ఈ దోమ కాటు వేస్తే కాళ్లు, చేతులు ఉబ్బిపోతాయన్నారు. అనంతరం బలిజకండ్రిగలో 300 మందికి, పాలసముద్రంలో 300 మందికి రక్త పరీక్షలు చేశారు. ఈ శ్యాంపుల్స్‌ను ల్యాబ్‌కు పంపించి పరీక్ష చేయిస్తామని డాక్టర్ మోహన్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్లు సుశీల, మురళి, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నేడు ప్రదోషకాల పూజలు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్‌ఎస్‌కండ్రిగ సమీపంలో ఉన్న అరుణగిరిపై కొలువైన శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం ప్రదోషకాల పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు రమేష్ శనివారం సాయంత్రం ఓ ప్రకటనలో తెలిపారు. ఆలయంలో ఏకకాలంలో నందీశ్వరునికి, శివునికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ పూజల్లో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

వ్యవసాయాభివృద్ధికి విశేష కృషి





మాట్లాడుతున్న ఆచార్య కార్తీక్‌రెడ్డి, సన్మానం అందుకున్న ఉత్తమ రైతులతో అధ్యాపక బృందం

పుత్తూరు: రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయాభివృద్ధికి విశేష కృషి చేస్తోందని తిరుపతి వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆచార్యులు డాక్టర్ పి.కార్తీక్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో కంటే నేటి భారతీయ వ్యవసాయ రంగం గణనీయంగా అభివృద్ధి చెందుతోందని చెప్పారు. వ్యవసాయ రంగంలోనూ సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింతగా మెరుగుపరుచుకోవాల్సి ఉందన్నారు. సత్యవేడు వ్యవసాయశాఖ ఏడీ సుబ్రమణ్యం మాట్లాడుతూ అత్యధిక జనాభా కలిగిన భారతదేశంలో వ్యవసాయ రంగం కుంటుపడితే దేశాభివృద్ధిపై పెను ప్రభావం చూపుతుందని చెప్పారు. వ్యవసాయాభివృద్ధికి ప్రతి కుటుంబం తమ వంతు చేయూత అందించాలని కోరారు. అనంతరం అర్థశాస్త్ర విభాగ అధ్యక్షుడు టి.నరసింహులు ఉత్తమ రైతులుగా ఎంపికైన ఎల్.దొరైరాజు(అన్నూరు), ఎ.సురేష్ (సముదాయం), వి.ఏలుమలైరెడ్డి (కొండలచెరువు), కె.సతీష్‌కుమార్ (అప్పంబట్టు), పి.ఆర్.శరవణ (నారాయణవనం), ఎస్.రాధాకృష్ణారెడ్డి (టి.సి.అగ్రహారం)కు జ్ఞాపికలు, నూతన వస్త్రాలు ఇచ్చి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులురెడ్డి, అధ్యాపకులు వరలక్ష్మి, బాబూరావు, వీరయ్య, వాణిశ్రీ, హరిబాబు, నాగేశ్వరరావు, సుజన, విద్యార్థులు పాల్గొన్నారు.

పుత్తూరులో మహిళ హత్య



సంఘటనా స్థలంలో మృతురాలు శ్రీదేవి

పుత్తూరు: పట్టణంలోని కల్యాణపురంలో శ్రీదేవి(49) అనే మహిళ హత్యకు గురైంది. సీఐ లక్ష్మీనారాయణ కథనం మేరకు.. కళ్యాణపురంలోని ఓ ఇంటి మిద్దెపైన గోపి, శ్రీదేవి దంపతులు కాపురం ఉంటున్నారు. వీరి కుమారుడు సాయి బెంగళూరులో ఉద్యోగం చేస్తుండగా, కుమార్తె వివాహమై చెన్నైలో నివసిస్తోంది. భర్త గోపి తిరుమలలో టీ దుకాణం నడుపుతుండడంతో వారానికి ఒకరోజు పుత్తూరుకు వచ్చి వెళుతుంటాడు. ఈ నేపథ్యంలో శ్రీదేవికి ఆమె కుమార్తె శుక్రవారం సాయంత్రం పలుమార్లు ఫోన్ చేసినా తీయకపోవడంతో రాత్రి 8 గంటల సమయంలో ఇంటి యజమానికి సమాచారం ఇచ్చింది. దీంతో ఇంటి యజమాని మిద్దెపైకి వెళ్లి చూడగా ఇంటికి తాళం వేసి ఉంది. అయితే ఇంట్లో నుంచి టీవీ శబ్దం వస్తుడడంతో అనుమానంతో తాళాలు పగులగొట్టి లోపలికి వెళ్లి చూడగా శ్రీదేవి ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నట్లు ఉంది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహం చైర్‌లో కూర్చొని ఉండడం, తలపై బలమైన గాయం కావడంతో రక్తస్రావం జరిగిన ఆనవాళ్లను గుర్తించారు. హతురాలి ఒంటిపై బంగారు వస్తువులు అపహరణకు గురైనట్లు గుర్తించారు. బంధువులు బీరువాలోని విలువైన వస్తువులు చోరీకి గురైనట్లు పోలీసులకు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించి, హత్య కేసుగా నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

పాలసముద్రం : ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేదల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్నారని, అర్హులైన ప్రతి ఒక్కరికీ కేంద్రప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయడమే బీజేపీ ప్రభుత్వ లక్ష్యమని ఆ పార్టీ కిసాన్ మోర్చ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ నాయుడు తెలిపారు. శనివారం పాలసముద్రంలో సర్పంచ్ అయ్యప్ప, వ్యవసాయాధికారి డిల్లీప్రసాద్ ఆధ్వర్యంలో వికసిత భారత సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో దేశాన్ని అన్ని రంగాల్లో పటిష్టం చేసేందుకు ప్రధాని మోదీ నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. అనంతరం కేంద్రప్రభుత్వం పథకాల గురించి ప్రచారం వాహనం ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల పరిధిలోని అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్ర.. పల్లెల్లో క్రీడా జాతర

- మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం



పాలసముద్రంలో..



నింద్ర: ర్యాలీలో విద్యార్థులు, అధికారులు



పుత్తూరులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



అవగాహన ర్యాలీ పాల్గొన్న ఎంపీపీ లత



పెనుమూరులో..



పోస్టర్ ఆవిష్కరణలో అధికారులు, ప్రజాప్రతినిధులు

నగరి: క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ అందించడానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆడుదాం ఆంధ్ర క్రీడాకారులకు క్రీడా జాతర లాంటిందని మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం అన్నారు. శనివారం ఓంశక్తి ఆలయం నుంచి టవర్‌క్లాక్ సెంటర్ వరకు ఆడుదాం ఆంధ్ర కార్యక్రమ విశిష్టతను తెలియజేసే విధంగా మున్సిపల్, మండల ప్రజా ప్రతినిధులు, అధికారులు సంయుక్తంగా నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం వార్డు, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభ గల క్రీడాకారులను గుర్తించడానికి ఉపయోగపడుతుందన్నారు. ఎంపీపీ భార్గవి, మున్సిపల్ కమిషనర్ కేవీఎస్ రెడ్డి, ఎంపీడీఓ లీలామాధవి, ఎంఈఓలు శ్రీదేవి, నమశ్శివాయం, మెప్మా అధికారి సునీత, వైస్‌చైర్మన్లు, వైస్‌ఎంపీపీలు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కోఆప్షన్ సభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యం

కార్వేటినగరం: ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సాహించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఆడుదాం..ఆంధ్ర క్రీడలను ప్రారంభించనుందని ఎంపీపీ లత అన్నారు. శనివారం ఆడుదాం..ఆంధ్ర కార్యక్రమంపై విద్యార్థులతో కలసి నగర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఇప్పటికే క్రీడాకారులు పెద్దఎత్తున రిజిస్ట్రేషన్లు చేసుకుని క్రీడల్లో పాల్గొనేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. అనంతరం బాలికల ఉన్నత పాఠశాల నుంచి విద్యార్థులతో పాటు, అధికారులు, ప్రజా ప్రతినిధులు గ్రామ వీధుల్లో భారీఎత్తున ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మోహన్‌మురళి, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, స్థానిక సర్పంచ్ ధనుంజయవర్మ, ఎంఈఓ విజయకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఆడుదాం.. ఆంధ్ర' మంచి అవకాశం

నింద్ర: గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఈ ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం దోహద పడుతుందని ఎంపీపీ దీప అన్నారు. మండల కేంద్రంలో శనివారం అధికారులు, విద్యార్థులతో కలిసి ఆడుదాం ఆంధ్ర అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అరుణ, ఎంఈఓ శ్రీధర్ రాజు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రను విజయవంతం చేయండి

పుత్తూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్ర టోర్నమెంట్‌ను విజయవంతం చేద్దామని డీఈఓ శేఖర్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలో మున్సిపల్, మండల పరిషత్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మానసిక ఉల్లాసానికి, ఆరోగ్యానికి క్రీడలు ఎంతో అవసరమన్నారు. ఈ నెల 15న ప్రారంభమైన ఈ పోటీలు జనవరి 26 వరకు జరుగుతాయన్నారు. ఈ పోటీల్లో క్రీడాకారులు తమ సత్తా చాటుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎస్ రెడ్డి, చైర్మన్ ఎ.హరి, వైస్ చైర్మన్లు శంకర్, జయప్రకాష్, ఎంపీడీఓ ప్రసాద్, ఎంపీపీ మునివేలు, ఎంఈఓలు తిరుమలరాజు, బాలసుబ్రమణ్యం, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వడమాలపేటలో

మండలకేంద్రం వడమాలపేటలో ఎంఈఓ పద్మావతి, ఎంపీడీఓ భానుమూర్తి ఆధ్వర్యంలో ఆడుదాం ఆంధ్ర పోటీలకు సంబంధించి భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సురేష్‌రాజు, నందయ్య, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

పెనుమూరులో..

పెనుమూరు(కార్వేటినగరం): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం.. ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి సుబ్రమణ్యం తెలిపారు. శనివారం మండల కేంద్రంలో విద్యార్థులతో కలసి ఆడుదాం..ఆంధ్ర కార్యక్రమం అవగాహన ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ మురళీరెడ్డి, విద్యాశాఖ అధికారులు భాస్కర్‌నాయుడు, రంగనాథరెడ్డి, ఈఓపీఆర్డీ మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులకు సదావకాశం

పాలసముద్రం: గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఎంపీడీఓ రామనాథరెడ్డి తెలిపారు. శనివారం మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో కలసి ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు రాజేంద్రప్రసాద్, గిరిజ, హెచ్‌ఎం మీనాక్షి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురంలో..

శ్రీరంగరాజపురం: మండలంలోని ఈ నెల 26 నుంచి ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారం అన్ని సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీఓ కృష్ణయ్య అన్నారు. స్థానిక అధికారులు, నాయకులు పాల్గొన్నారు.